క్లుప్తంగా

క్రీడా పోటీలను జయప్రదం చేయండి

ఓర్వకల్లు : ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం..ఆంధ్ర' క్రీడా పోటీలను జయప్రదం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా పోటీల నిర్వహణపై పాఠశాల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలతో పీడీఓ శివనాగప్రసాద్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్, ఈఓఆర్డీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉత్తరద్వార దర్శనం



శ్రీ వీర నారాయణస్వామి మూలవిరాట్

పాణ్యం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 23న శ్రీవీరనారాయణస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకునే ఏర్పాటు చేసినట్లు ఈఓ సువర్ణ గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్వామి వారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారన్నారు. తెల్లవారుజామున 4 గంటలకు స్వామి వారికి రుద్రాభిషేకం, గోపూజ, 4.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కోడుమూరు రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. గురువారం మండలంలోని క్రిష్ణాపురం, ముడుమలగుర్తి గ్రామాల్లో మండల అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డీఎంఅండ్ హెచ్ఓ డా.రామగిడ్డయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ వేల్పుల గోపాల్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం



అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా మైనింగ్ డీడీ రాజశేఖర్

కర్నూలు (న్యూటౌన్): అక్రమ మైనింగ్‌కు పాల్పడితే ఉపేక్షించమని, ఉక్కుపాదం మోపుతామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం సి బెళగల్ మండలం సర్వే నంబర్ 60లో, గూడూరు మండలం బూడిదపాడులో సర్వే నంబర్ 226, కర్నూలు మండలం పూడూరు గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డీడీ మాట్లాడుతూ బ్రాహ్మణదొడ్డిలో బీముగూడ అశోక్ అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు వెల్లడించారు. బూడిదపాడు, పూడూరులో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారంతో ఆకస్మికంగా దాడులు చేస్తున్నామన్నారు. విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు మురహరి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.

24న ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ప్రజారోగ్య వేదిక, ఏపీ మెడికల్ అండ్ సేల్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 24న సుందరయ్యభవన్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సుందర్య స్ఫూర్తి కేంద్రం చైర్మన్ కె.ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యులు బీపీ, షుగర్, పక్షవాతం, ఫిట్స్ జబ్బులకు వైద్యం అందించనున్నట్లు చెప్పారు.

వైద్యులను నియమించాలి

కర్నూలు(సెంట్రల్): స్థానిక గడియారం ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులతోపాటు ఇతర పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం బృందం సభ్యులు ఎస్‌డీ ఖాజా పాషా, మహబూబ్‌బాషా కలిసి ఆసుపత్రిని సందర్శించారు.



పాణ్యంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని



కోడుమూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్



సి.బెళగల్‌లో రక్తదానం చేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

పేదల అభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య
- ఘనంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు
- కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో రక్తదాన శిబిరం

కల్లూరు: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ చెన్నమ్మ సర్కిల్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కర్నూలు, అన్నమయ్య జిల్లాల మహిళ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ (కార్పొరేటర్) శ్వేతా రెడ్డి రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు యువకులు జగనన్న మీద అభిమానం చాటుకున్నారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ అందరూ అభివృద్ధి చెందాలనే కులమతాలకు, రాజకీయాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలన్నారు. టీడీపీ చేస్తున్న అసత్యాలను, ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

పర్ల, బస్తిపాడు గ్రామాల్లో..

జననేత జగనన్న జన్మదిన వేడుకలను పర్ల, బస్తిపాడు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ అశోక్ వర్ధన్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నరేంద్రనాథ్‌రెడ్డి, భార్గవ్, ఖాజా, సవారి, నరసింహులు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

గడివేముల మండలంలో..

గడివేముల: పెసరవాయి గ్రామంలో నంద్యాల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శిరుప శ్రీనివాస రెడ్డి, పార్టీ యూత్ వింగ్ సెక్రటరీ ద్వారం శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీఎం జగనన్న జన్మదినాన్ని పురస్కరించుకొని కేకును కట్ చేశారు. బిలకలగూడూరు గ్రామానికి చెందిన సింగిల్‌విండో అధ్యక్షుడు పోగుల చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేసి సీఎం జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఎల్‌కే తండాలో వైస్ ఎంపీపీ కాలునాయక్ ఆధ్వర్యంలో 10 కేజీల కేక్‌ను కట్ చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. అలాగే వివిధ గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వాడవాడలా జగనన్న పుట్టిన రోజు వేడుకలు

పాణ్యం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే భారీ కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. కోట్లాది మంది ప్రజాశీస్సులతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌కు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, సచివాయలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, బాబు, కృష్ణారెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



పర్లలో గ్రామస్తులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎల్‌కే తాండలో కేకును కట్ చేస్తున్న వైస్ ఎంపీపీ కాలునాయక్



కోడుమూరులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారీ బైకు ర్యాలీ



గూడూరులో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు



సి.బెళగల్‌లో భారీ బైక్ ర్యాలీ

పేదల పెన్నిధి సీఎం వైఎస్ జగన్

కోడుమూరు రూరల్ : సంక్షేమ ప్రదాత.. పేదల పెన్నిధి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం కోడుమూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఓ పండుగలా నిర్వహించారు. జగనన్న జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోడుమూరులోని కొత్త బస్టాండ్ సర్కిల్ నుంచి కర్నూలు రోడ్డులోని మహానేత వైఎస్సార్ విగ్రహం వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అక్కడి నుంచి కోడుమూరులోని ప్రభుత్వాసుపత్రికి చేరుకుని రోగులు, బాలింత మహిళలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లామ్, జెడ్పీటీసీ సభ్యులు మౌలాలి, గిరిజోను, ప్రసన్నకుమార్, సర్పంచులు బాలకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ బొంతల మునెప్ప, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జీ లాయర్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

అమడగుంట్లలో ఉచిత వైద్య శిబిరం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా సీఐ శ్యామరావు, స్నేహితులు, పీఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని అమడగుంట్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 476 మందికి రక్త పరీక్షలు, బిపి, షుగర్, గుండె సంబంధిత పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బీమేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, చెన్నారెడ్డి, ఉపసర్పంచు మోదీన్‌బాషా పాల్గొన్నారు.

పాలాభి షేకం చేసిన కాంటాక్ట్ లెక్చరర్లు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న కాంటాక్ట్ లెక్చరర్లు సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సాంబశివారెడ్డి, రాధాకుమారి, శాంతిప్రియ , మాధవీలత,నరసింహులు , తదితరులున్నారు.

పండుగలా జగనన్న పుట్టిన రోజు వేడుకలు

సి.బెళగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు సి.బెళగల్ మండలంలో పండువను తలపించాయి. గురువారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 51వ జన్మదినం సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలకు ఘనంగా జరిగాయి. పోలకల్ గ్రామంలో పార్టీ అభిమానులు గజమాలతో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, కేక్‌ను కట్ చేశారు. అక్కడి నుంచి భారీగా చేరుకున్న బైక్ ర్యాగా సి.బెళగల్‌కు చేరుకున్నారు. సి.బెళగల్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహానికి, బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డితో పాటు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు, యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. మొత్తం 218 మంది రక్త దానం చేసిన అక్షయ బ్లడ్‌బ్యాంక్, రెడ్ క్రాస్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల సభ్యులు తెలిపారు. దాదాపు ఐదు వేల మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ గోవిందరెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సి.బెళగల్‌లో సీఎం జన్మదిన వేడుకలకు భారీగా హాజరైన ప్రజలు

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

సీఎం జన్మదినం సందర్భంగా గురువారం సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ 900 మంది విద్యార్థులకు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని పోలకల్ గ్రామంలో ఎంపీపీ బొంతల మునెప్ప స్వగృహంలో సీఎం జన్మదిన వేడుకలను నిర్వహించారు. పీఎంసీ మాజీ చైర్మన్ హోటల్ గోవిందు గ్రామంలో ప్రజలకు స్వీట్‌ను పంపిణీ చేశారు.

కోడుమూరులో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం తథ్యం

నియోజకవర్గంలో పార్టీ ముచ్చటగా మూడో సారి విజయం సాధిస్తుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందజేస్తున్న ఘనత జగనన్న సాధించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, వైఎస్సార్‌సీపీ స్టేట్ కమిటీ సభ్యులు సంధ్య విక్రమ్ కుమార్, పార్టీ సభ్యులు గీతాశ్రీ, మద్దయ్య తదితరులు ఉన్నారు.

గూడూరులో ఘనంగా వేడుకలు

గూడూరు: పట్టణంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పాత బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న జెడ్పీటీసీ మౌలాలి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



గూడూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

రగ్బీలో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విజేతలకు మెగా చెక్కును ప్రదానం చేస్తున్న యాజమాన్యం

ఓర్వకల్లు: ఈ నెల 18న నిర్వహించిన ఖేలో ఇండియా రగ్బీ పోటీలలో స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హరిత తెలిపారు. కల్లూరు మండలం , చిన్నటేకూరు సమీపంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన అండర్ -14 విభాగం పోటీలలో పాఠశాలకు చెందిన విశ్వభారతి, శిరీష, ధరణి, లావణ్య, గాయత్రీ, నందిని, రేణుక, సులోచన, శశిర అను విద్యార్థినులు ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచారన్నారు. అందుకు రూ.50వేల నగదుతో పాటు, మెడల్స్‌ను దక్కించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన విద్యార్థినులతో పాటు, పీఈటీ వెంకటలక్ష్మిని ప్రిన్సిపాల్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

కర్నూలు(లీగల్): ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టం 2022ను, జీఓ నెం.512ను రద్దు చేయాలని ధర్నా చౌక్‌లో చేపట్టిన న్యాయవాదుల రిలేనిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షలో న్యాయవాదులు లక్ష్మణ్, జాస్మిన్, అనిల్ బాయ్, రాధిక, రూప, లక్ష్మి కూర్చున్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు పుల్లారెడ్డి, మహేశ్వరరావు, ప్రజానాట్యమండలి నాయకులు, సీనియర్ న్యాయవాదులు శ్రీధర్, వెంకటస్వామి, రవిగువేరా, తిరుపతయ్య, కృష్ణమూర్తి, ఓంకార్, రవికుమార్, ఆంజనేయులు, షఫల్, శ్రీను పాల్గొన్నారు.

బాలలను పనుల్లో పెట్టుకోవద్దు



అధికారులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): బాల, బాలికలను పనుల్లో పెట్టుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు సూచించారు. గురువారం కార్మిక శాఖ అధికారులు, డీసీపీఓ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, బచ్‌పన్ బచావో జిల్లా కో-ఆర్డినేటర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, ఎన్‌సీఎల్‌పీ అధికారి, పోలీసు, జ్యువైనల్ సంక్షేమం తదితర శాఖల అధికారులతో కలిసి నగరంలో తనిఖీలు నిర్వహించారు. సి.క్యాంప్ సెంటర్, కొత్తబస్టాండ్, ఆనంద్ థియేటర్ ప్రదేశాలలో ఐదుగురు వీధి బాలలను గుర్తించి కొందరిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిగతా వారికి చదువుకోవడానికి సాయం చేశారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ

కర్నూలు సిటీ: గ్రామీణ ప్రాంతాల్లోని పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కర్నూలు రూరల్ ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఈ.తాండ్రపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పల్లెల్లోని ప్రతి ఒక్కరి ఆరోగ్యం పట్ల ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. పీహెచ్‌సీ పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ మాధురి మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలని, హెల్త్ సెంటర్ పరిసరాలను క్లీనింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రానికి వచ్చే పేషెంట్లకు తాగునీరు, మీటింగ్ హాలు, పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆ తరువాత ఆరోగ్యశ్రీ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు తయారు చేసిన కరపత్రాలను ఎంపీపీ చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం పీహెచ్‌సీని ఎంపీపీ తనిఖీ చేసి, మందుల లభ్యత తదితర వివరాలను డాక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీఓ అజాంఖాన్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, తదితరులు, పాల్గొన్నారు.

నవలల ఆవిష్కరణ



నవలలను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ డి.వి.ఆర్. సాయిగోపాల్, తదితరులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత ఎస్.డి.వి. అజీజ్ రచించిన టిప్పుసుల్తాన్, బుడ్డా వెంగళరెడ్డి చారిత్రక నవలలను ప్రొఫెసర్ డి.వి.ఆర్. సాయిగోపాల్ గురువారం ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నవలల ఆవిష్కరణ కార్యక్రమంలో రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, కేవీఆర్ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ డి.పార్వతీదేవి, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జె.హేమంత్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను పంపిణీ చే స్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాణ్యం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో పోటీ పడేలా తయారవ్వాలని ట్యాబ్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. గురువారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చేపట్టిన చర్యలతో ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఖండాలు దాటి ప్రతిభ చూపారన్నారు. ఇటీవల విద్యార్థులు ఐక్యరాజ్యసమితిలో తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారని గుర్తుచేశారు.

తండ్రికి తగ్గ తనయుడు

తండ్రి వైఎస్సార్ బాటలో పయనించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద బతుకులను మార్చి.. ప్రతి పేద వాడికి ఉన్నత విద్య అందించాలనే ఉద్దేశంతో విద్యా విధానంలో మార్పులు తెచ్చారన్నారు. అమ్మఒడి, నాడు-నేడు, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీవిద్య, ఉన్నత విద్య, ఇంగ్లిష్ మీడియంతో పాటు అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు.

పిల్లల సమక్షంలో సీఎం పుట్టినరోజు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విద్యార్థుల సమక్షంలో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పంచిపెట్టారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, చైర్మన్ కవిత, ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌హుసేన్, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

170 ట్యాబ్‌ల పంపిణీ

గడివేముల: మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మొదటి విడతగా 170 ట్యాబ్‌లను గురువారం పంపిణీ చేసినట్లు ఎంఈఓ-2 విమలా వసుంధరదేవి తెలిపారు. స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఎంపీటీసీ వంగాల మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సంజీవరెడ్డి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇమ్మానియల్, ఉపాధ్యాయులు భుజంగరావు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



గడివేముల జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చదువుతోనే సామాజిక చైతన్యం

- డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: చదువుతోనే విద్యార్థుల్లో సామాజిక చైతన్యం వస్తోందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన 'ఉచిత ట్యాబ్‌లు' పంపిణీ చేశారు. హెచ్ఎం రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డ్వామా పీడీతో పాటు ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ తల్లి తండ్రులు తమ పిల్లల చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ట్యాబ్‌లను ఉపయోగించుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. మనబడి నాడునేడు ద్వారా పాఠశాల రూపురేఖలు మార్చడమేగాక, విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారని తెలపారు. ఎంఈఓ ఓంకార్‌యాదవ్ మాట్లాడుతూ మండలానికి తొలి విడత కింద 170 ట్యాబ్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్, సర్పంచ్ నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు షాకీరున్నిషా, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానికులు శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దయ్య, పీఎంసీ చైర్మన్ మద్దిలేటి, విద్యార్థుల తల్లితండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న పీడీ అమరనాథ్‌రెడ్డి